క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో మాధురి



తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారిగా కె.మాధురి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శిక్షణ ముగించుకుని తొలిసారి తిరువూరు రెవెన్యూ డివిజన్‌కు నియమితులైన ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీఓ కొత్తా మాధవి అమలాపురానికి బదిలీపై వెళ్లారు.

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన రమ్య కీర్తన విజయవాడ జోనల్ కమిషనర్‌గా తిరిగి పూర్వ స్థానానికి బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు ఒంగోలు మున్సిపాలిటీలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృది పథంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోరారు. విజయవాడ ఎన్నికల కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి సోమవారం ఆయన స్థానిక కౌన్సిలర్లతో కలసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె సాధ్యమైనంత త్వరగా ఎన్నికలను నిర్వహిస్తామని వెల్లడించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

10న ఇబ్రహీంపట్నంకు జ్యోతిర్మఠ్ పీఠాధిపతి రాక

మైలవరం: ఉత్తరాఖండ్ జ్యోతిర్మఠ్ పీఠాధిపతి శ్రీశంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతీ స్వామి ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌కు రానున్నట్టు స్వాగత కమిటీ చైర్మన్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోమాతను జాతీయ మాతగా గుర్తించాలని కోరుతూ సరస్వతీ స్వామి సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 26 వరకు భారతదేశంలోని 37 రాష్ట్రాల్లో భారత్ యాత్ర చేస్తున్నట్టు చెప్పారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ఆయన రాక సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను పాల్గొనవలసిందిగా కోరినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముసునూరులో అతి రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఏఎస్‌ఐ నాగభూషణరావు సిబ్బందితో కలసి దాడిచేశారు. ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని మంగళవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

120 మద్యం సీసాలు స్వాధీనం



మైలవరం: తెలంగాణ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 120 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు మైలవరం సీఐ దాడి చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. స్థానికంగా ఉన్న మామిడి తోటలో జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14,150 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు.

నూతన ఎంపీడీఓ భార్గవి బాధ్యతల స్వీకారం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సోమవారం బాపతి భార్గవి బాధ్యతలు చేపట్టారు. విజయవాడ రూరల్ మండలం ఎంపీడీఓగా పనిచేస్తూ ఆగిరిపల్లి మండలానికి ఆమె బదిలీపై వచ్చారు. పరిపాలన అధికారి అబ్దుల్ సలాం, కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సామాన్యుడిపై దసరా ధరువు



మైలవరం: దసరా పండుగకు నిత్యావసర సరకులు, కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. కూరగాయలు, వంట నూనె, కరెంట్ బిల్లులు, పాల ప్యాకెట్‌ల ధరల పెరుగుదల గురించే సామాన్యులు మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబాల వారు ఒక్క సారే కిలో నూనె ప్యాకెట్లు కొనలేక స్థానికంగా ఉండే చిన్న చిన్న కిరాణా షాపుల్లో వంద గ్రాములు, 50 గ్రాములు కొంటున్నారు. నలుగురు ఉన్న కుటుంబానికి కనీసంగా పూటకు అరకిలో కూరగాయలు కావాల్సిందే. సామాన్యుడికి ఒక్క కూరగాయలకే రోజుకు కనీసంగా రూ.80 ఖర్చు చేయాల్సివస్తుంది. కూరగాయల్లో ముఖ్యంగా టమోటా కిలో రూ.80కి చేరింది. అదనంగా ఇంట్లో రోజువారీ ఖర్చు ఉండనే ఉంటుంది. ఇక పామాయిల్ దాదాపు వంద రూపాయలు అమ్ముతున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.80 దాకా విక్రయిస్తున్నారు. ఇదే కొనసాగితే పేద, మధ్య తరగతి ప్రజలు పచ్చళ్లపై ఆధార పడి కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దాంతో వారు ఆసుపత్రులు పాలవక తప్పదు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి కూరగాయలు, నిత్యావసర సరకుల ధరలు సామాన్యుడికి అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

కొనేటట్టు లేదు, తినేటట్టు లేదు



కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవు. ఏమీ కొనేటట్టుగా లేవు. తినేటట్టుగా లేవు. గతంలో ఎన్నడూ లేని విధంగా నూనెలు, నిత్యావసర సరకుల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. ప్రభుత్వం స్పందించి రైతు బజారుల్లో కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే వరద ప్రభావంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ ధరలతో కడుపు నిండా తినాలన్నా తినలేని పరిస్థితి నెలకొంది.

–డి.చలపతిరావు, పొందుగల

కూరగాయలు	ధరలు (కిలో)		
	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్
టమాటా	30	32	80
వంకాయ	30	28	38
బెండకాయ	16	42	32
మిర్చి	50	20	5
కాకర	44	20	40
బీర	30	30	50
క్యాబేజీ	30	24	26
క్యారెట్	46	44	50
దొండకాయ	32	28	40
ఉల్లిపాయలు	38	55	54
దోస	16	25	32
గోరు చిక్కుడు	34	28	33
సొరకాయ (1)	10	20	20
చామదుంప	38	38	38
పొట్ల కాయ (1)	20	20	25
అరటికాయ (1)	07	07	07
మునగకాయలు(1)	07	06	07
కొత్తిమీర కట్ట	20	40	22
నూనెలు...			
వేరు శనగ	145	145	145
పామాయిల్	95	95	130
వనస్పతి	108	105	143

రేపటిలోగా ఈ-పంట నమోదు చేయాలి

తిరువూరు: ఖరీఫ్ సీజన్లో పంటలు సాగు చేసే రైతులు ఈ నెల 9వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ కోరారు. మండలంలో 8,409 మంది రైతులకు పంట నమోదు చేయగా, 7,951 మంది రైతులకు ఈకేవైసీ పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రైతులకు కూడా ఓటీపీ ద్వారా లేదా బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలైన సున్నా వడ్డీ రాయితీపై పంట రుణాలు, పంటల బీమా, నష్ట పరిహారం, కనీస మద్దతు ధర చెల్లింపు వంటి అవకాశాలుంటాయని తెలిపారు.

కౌన్సిలర్ నాగసుధ మృతి బాధాకరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ ఆకస్మిక మరణం బాధాకరమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లిలో సోమవారం జరిగిన నాగసుధ అంత్యక్రియలకు ఆయన హాజరయ్యారు. చర్చిలో జరిగిన ప్రార్థన కూడికలో పాల్గొని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్సీఎం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

16 దుకాణాలకు 90 అర్జీలు

రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా నూజివీడు నియోజకవర్గంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. నియోజకవర్గానికి 16 దుకాణాలను కేటాయించగా, ఇప్పటివరకు 90 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటలతో ముగియనుంది. దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు లాటరీలో పాల్గొనాలంటే ఒక్కొక్క దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఎన్ని దరఖాస్తులు పెడితే అన్ని రూ.2 లక్షలు చెల్లించాల్సిందే. ఈ డబ్బు తిరిగి చెల్లించడం జరగదు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గానికి మంజూరైన 16 మద్యం దుకాణాల్లో నూజివీడు పట్టణంలో 3, మండలంలో 4, ఆగిరిపల్లి మండలంలో 4, ముసునూరు మండలంలో 3, చాట్రాయి మండలంలో 2 చొప్పున కేటాయించారు. వీటికి మొదటి ఏడాది (2024–25) లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలుగా, తరువాత సంవత్సరం 10 శాతం పెంచి రూ.71.50 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. మండలం యూనిట్‌గా మంజూరైన షాపులను మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు.



నూజివీడులోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద అర్జీలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దు

నూజివీడు ఆర్డీఓ వాణి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని, అలసత్వం వహించొద్దని నూజివీడు ఆర్డీవో మొవిడి వాణి స్పష్టం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీకోసంలో అర్జీ ఇస్తే సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో పెంచాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సోమవారం నాటి మీ కోసంలో మొత్తం 15 అర్జీలు రాగా, అందులో పింఛన్లు మంజూరు చేయాలని, భూమిని సర్వే చేయాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలపై వచ్చినవి ఉన్నాయి. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరాని, డీఎల్‌పీఓ సుందరి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఆర్డీవో మొవిడి వాణి

వరుణ్ మోటార్స్ షోరూంను సందర్శించిన విద్యార్థులు

మైలవరం: ఇంటర్న్‌షిప్ వలన విద్యార్థులకు వర్కింగ్ స్కిల్స్ పెంపొందుతాయని సమగ్ర శిక్ష రాష్ట్ర ఇంటర్న్‌షిప్ అధికారి దీపికా రాణి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం వరుణ్ మోటార్స్ షోరూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా దీపికా రాణి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులకు ఇటువంటి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వరుణ్ మోటార్స్ రమేష్ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర ఇంటర్న్‌షిప్ ఆఫీసర్ డాక్టర్ దీపికారాణి, ఐటీ ఒకేషనల్ ట్రైనర్ మాస్టర్ ఎం.చెన్నారావు, హైస్కూల్ ఒకేషనల్ టీచర్ ఎ.ఆషా, ప్రిన్సిపాల్ ఎ.శ్యామసుందరరావు, ఇన్‌చార్జి కె.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



వరుణ్ మోటార్స్ షోరూమ్‌ను సందర్శించిన విద్యార్థులు

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ఎంపీడీవో జి.రాణి



చాట్రాయి: మండలంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కొత్తగా సీసీ రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల మరమ్మతులపై, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో ఉర్దూ టీచర్ నియామకం, చనుబండలో పీహెచ్‌సీ నిర్మాణ పనుల విషయమై సమావేశంలో చర్చించారు. ఎంపీపీ పి.సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సీహెచ్ అనూష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట వేడుక



ఆగిరిపల్లి: స్థానిక వరాహ పుష్కరిణి వద్ద గల ముక్తేశ్వర స్వామి ఆలయంలో కాలభైరవ, చండీశ్వర విగ్రహాలను సోమవారం వైభవంగా ప్రతిష్ఠించారు. దాత, విశ్రాంత ఉపాధ్యాయుడు జూలూరు చంద్రమౌళీశ్వరరావు, ఆయన కుమారుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులకు నూతన విగ్రహాలను అందజేశారు. ఆలయ అర్చకులు ధాన్య దివాసం, ప్రాణ ప్రతిష్ఠ, అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు.

అక్రమంగా భూములు కొంటే ప్రతిఘటిస్తాం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు

నూజివీడు: మండలంలోని సిద్ధార్థ నగర్‌లో ఆర్‌ఎస్ నంబర్ 1/1, 1/2 లలో పేద గిరిజనుల సాగులో ఉన్న బంజరు భూములను ఎవరూ కొనడం గాని, అమ్మడం గాని చేయొద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు విజ్ఞప్తి చేశారు. సిద్ధార్థనగర్‌లో సోమవారం సాగుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం ఆ ప్రాంతంలో వందలాది ఎకరాల బంజరు భూములను పేదలకు పంపిణీ చేశారని, వాటిని ఇటీవల కొంతమంది అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా తెలిసిందన్నారు. వాటిని బయటి ప్రాంతాల వారు కొంటే మళ్లీ ఆక్రమించి పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ భూములు ఎవరు కొనకుండా, అమ్మకుండా రెవెన్యూ, ప్రభుత్వ అధికారులు ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ నేత ఎస్.నరసింహ, భూపోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నుంచి సేకరించిన రూ.43 లక్షల విలువ చేసే 71 టన్నుల ఆహార ధాన్యాలను సోమవారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని వరద బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చినట్టు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలసి మండలంలోని అంబాపురం, పి.నైనవరం, పాతపాడు గ్రామాల్లోని వరద బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుగుణ పాల్గొన్నారు.



వరద బాధితులకు బియ్యం అందజేస్తున్న మాజీ మంత్రి రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇలాగైతే..రాకపోకలు సాగేదెలా!



నూజివీడులోని రైతుబజార్‌లో స్తంభించిన ట్రాఫిక్

నూజివీడు: పట్టణంలోని రైతుబజారు రోడ్డు నానాటికీ ట్రాఫిక్ ఇబ్బందులకు నిలయంగా తయారైంది. అసలే ఇరుకు రోడ్డు కావడం.. ఈ మార్గంలోనే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు సైతం రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ చిక్కులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కూరగాయల దుకాణాలకు వచ్చే ప్రజలు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేయడం, వాటికి తోడు కార్లు, ఆటోలు కూడా రాకపోకలు సాగిస్తుండటంతో ఇరుకు రోడ్డులో అన్నీ ఇరుక్కుపోయి ట్రాఫిక్ గంటల తరబడి ఆగుతోంది. దీంతో కూరగాయలు కొనుక్కోవడానికి వచ్చిన మహిళలు, వృద్ధులు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నారు. రోజులో దాదాపు ఏడెనిమిది సార్లు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

ఇప్పటికైనా పోలీసు అధికారులు రైతుబజారు రోడ్డులోని ట్రాఫిక్ సమస్యను పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం అత్యావశ్యకం

ఎంపీపీ కొండా దుర్గాభవాని

ముసునూరు: ప్రతి గ్రామ అభివృద్ధిలో ఉప సర్పంచ్, వార్డు సభ్యుల భాగస్వామ్యం అత్యంత అవశ్యకమని ఎంపీపీ కొండా దుర్గాభవాని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల భాగస్వామ్యానికి సంబంధించిన ఎనిమిది అంశాలపై మాస్టర్ ట్రైనర్, చింతలవల్లి పంచాయతీ కార్యదర్శి నీరజ సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బీఏ సత్యానారాయణ, పలు గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కొండా దుర్గాభవాని

ఆవులను తరలిస్తున్న లారీల స్వాధీనం



గంపలగూడెం: మండలంలోని నెమలి గ్రామం వద్ద ఆవులను తరలిస్తున్న మూడు లారీలను గంపలగూడెం పోలీసులు సోమవారం స్వాధీన పరచుకున్నారు. ఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు మూడు లారీల్లో 150 ఆవులను తరలిస్తుండగా గుర్తించి నిలిపివేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆవులను గుంటూరు జిల్లా అనంతవరం గోశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో చూడిగేదె మృతి

జి.కొండూరు: మండలంలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ పైపునకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి సోమవారం సాయంత్రం చూడి గేదె మృతి చెందింది. గేదెలను మేత నుంచి ఇంటికి తరలిస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితురాలు విమలమ్మ తెలిపారు. ఈ ప్రమాదం వలన తాను రూ.70వేలు నష్టపోయినట్లు చెప్పారు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని కోరారు.

మహాచండీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తిరువూరు రంగనాయక స్వామి ఆలయంలో తామర పూలతో విశేషపూజ



మహాచండీ అలంకారంలో పుట్రేల మారెమ్మ



విస్సన్నపేటలో మహాచండీ అలంకారంలో అమ్మవారు



మైలవరం పాండురంగ స్వామి ఆలయంలో...

తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదవరోజు అమ్మవారు పలు ఆలయాల్లో మహా చండీదేవిగా దర్శనమిచ్చారు. మరికొన్ని ఆలయాల్లో కాత్యాయనిగా, లలితా పరమేశ్వరిగా, అన్నపూర్ణగా వివిధ రూపాల్లో భక్తులకు కనువిందు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.


–సాక్షి నెట్‌వర్క్



నూజివీడులో శ్రీ చండీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన కోట మహిషమ్మ



చాట్రాయి మెయిన్ రోడ్డులో పూజలందుకుంటున్న అమ్మవారి ప్రతిమ



నెమలిలో సంతానలక్ష్మిగా...

అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



తిరువూరు: స్వామి అయ్యప్ప భక్తుల మండల దీక్షలను సోమవారం ప్రారంభించారు. స్థానిక రాజుపేట అష్టలక్ష్మీ ఆలయంలో గురుస్వామి మూర్తి స్వామి పలువురు దీక్షాపరులకు మాలధారణ చేయించారు. దీక్షా సమయంలో పాటించాల్సిన నియమావళిని వివరించారు. శబరిమలకు వెళ్లేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. దీక్షధారులకు మాల ధారణ అనంతరం భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముసునూరు ఎస్‌ఐగా చిరంజీవి బాధ్యతల స్వీకారం

ముసునూరు : ముసునూరు ఎస్‌ఐగా సోమవారం ఎం.చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం ద్వారా మండలంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తానని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులపై తక్షణం దృష్టి సారిస్తానన్నారు.